శుద్ధ జలం సాకారమయ్యేనా..!

- మూడు ప్రాంతాల్లో ప్లాంట్ల నిర్మాణానికి స్థలాల పరిశీలన
- ఉన్నతాధికారులకు నివేదికలు


తామర చెరువు సమీపంలో సీ వేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం చేపట్టనున్న స్థలం

పెడన: పట్టణంలో మురుగునీరు పంట కాలువల్లో కలుస్తోందని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో మురుగునీటిని శుద్ధజలంగా మార్చి ఆ నీటిని పంట కాలువల్లోకి వదిలేలా ప్రణాళికలు రూపొందించారు. సీ వేజ్ ట్రీట్‌మెంట్ వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులను స్వచ్ఛత కార్పొరేషన్ వారికి ఎన్డీయే కూటమి అప్పగించింది. దీంతో వారు మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి రెండు నెలల క్రితం మూడు శివారు స్థలాలను పరిశీలించారు. గుడివాడ రోడ్డులోని తామర చెరువు, తోట మూలలోని జెడ్పీ హెచ్‌ఎస్ సమీపంలోనూ, పెడన–మచిలీపట్నం బైపాస్ రోడ్డులోని ఫ్లై ఓవర్ సమీపంలో స్థలాలు అనువుగా ఉన్నాయని తేల్చారు. వీటిని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సర్వేయర్లతో క్షుణ్ణంగా పరిశీలించి ఆయా స్థలాలు ఎవరికి చెందినవో గుర్తించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపించారు.

1.77 ఎకరాలు అవసరం

సీ వేజ్ ట్రీట్‌మెంట్ వాటర్ ప్లాంట్ (మురుగునీటిని మంచినీరుగా చేసే ప్లాంటు)లు మూడు నిర్మించాలి. వేర్వేరు ప్రాంతాల్లో మూడు నిర్మించడానికి స్వచ్ఛత కార్పొరేషన్ వద్ద రూ. 3.50 కోట్ల నిధులు ఉన్నాయి. వాస్తవంగా రూ. 4.50 కోట్లు అవుతుందని అంచనా. స్థల సేకరణకు ముందుగా నిధులు విడుదల చేసి కొనుగోలు చేయాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. తామర చెరువు వద్ద 0.96సెంట్లు, పెడన–మచిలీపట్నం బైపాస్ రోడ్డులో 0.64 సెంట్లు, తోటమూల వద్ద 0.17 సెంట్లు స్థలాలను కొనుగోలు చేసి ప్లాంట్లు నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం స్థలాలను ఇంకా కొనుగోలు చేయకపోవడంతో ఈ ప్లాంట్ల నిర్మాణం సాకరమవుతుందా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

స్థలాలను పరిశీలించాం



సీ వేజ్ ట్రీట్‌మెంట్ వాటర్ ప్లాంట్లను స్వచ్ఛత కార్పొరేషన్ వారు నిర్మించి మున్సిపాలిటీకి అప్పగిస్తారు. ఆ తర్వాత వాటిని మెయింటెన్స్ చేయాల్సి ఉంటుంది. టౌన్ సర్వేయర్, టౌన్‌ప్లానింగ్ వారు స్థలాలను రెవెన్యూ వారితో కలిసి పరిశీలించి ఆయా నివేదికలను సీఎండీ, ఎంయూఐడీలలోని ఉన్నతాధికారులకు పంపించడం జరిగింది.

ఎం. గోపాలరావు, కమిషనర్, మున్సిపాలిటీ, పెడన

ప్రతిపాదనలు పంపించాం



సీ వేజ్ ట్రీట్‌మెంట్ వాటర్ ప్లాంట్ల నిర్మాణానికి స్థలాలను పరిశీలించడం జరిగింది. మూడు ప్రాంతాల్లో స్థలాలను ఎంపిక చేసి ఆయా స్థలాలకు చెందిన హక్కుదారులు ఎవరు అనే వివరాలను ఉన్నతాధికారులకు పంపించడం జరిగింది. వారి నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం స్థలాలను కొనుగోలు చేసి మున్సిపాలిటి, స్వచ్ఛత కార్పొరేషన్ వారికి అప్పగించడం జరుగుతుంది.

కె. అనిల్‌కుమార్, ఇన్‌ఛార్జి తహసీల్దారు, పెడన

క్లుప్తంగా

నేడు సత్యదేవుని వ్రతాలు

కోడూరు: భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని విశ్వశాంతి యాగ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం హంసలదీవిలో సామూహిక సత్యదేవుని వ్రతాలు నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు మోపిదేవి చక్రవర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హంసలదీవి వేణుగోపాలుడి ఆలయ సన్నిధిలో 1008మంది దంపతులతో టీటీడీ వేదపాఠశాల విద్యార్థుల మంత్రోచ్ఛరణల నడుమ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

డివిజన్‌ల్లో పర్యటించిన జెడ్పీ సీఈఓ



మచిలీపట్నంటౌన్: నగరంలోని 4వ డివిజన్‌లో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి, పది డివిజన్‌ల నోడల్ అధికారి ఆర్‌సీ ఆనంద్ కుమార్ శుక్రవారం పర్యటించారు. గృహాల నుంచి వచ్చే చెత్తను తడి, పొడి చెత్తగా విడదీసి కార్మికులకు అందించడం ఎలా అమలవుతోందో ఆయన పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి మహిళలు తెస్తున్న చెత్తను పరిశీలించి తడి, పొడి చెత్తను వేరు చేసి ఇచ్చే పద్ధతిని వారికి వివరించారు. కార్యక్రమంలో వార్డు శానిటేషన్ సెక్రటరీ కె. కృష్ణప్రియ, హెల్త్ అసిస్టెంట్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

10 నుంచి చౌడేశ్వరి దేవి జ్యోతీర్మహోత్సవాలు

పెడన: పట్టణంలోని బ్రహ్మపురంలో వేంచేసి ఉన్న శ్రీరామలింగ చౌడేశ్వరి భజన గుడి వద్ద ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు శ్రీమత్ చౌడేశ్వరి దేవి జ్యోతీర్మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం హారతి కర్పూరం వెలిగించి పురవీధుల్లో తిరుగుతూ కమిటీ సభ్యులకు అమ్మవారి కుంకుమను అందించి మహోత్సవాలకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ఊటుకూరి ఏకనాథ్ సుధీర్‌కుమార్, హేమ కనకదుర్గ నాగరాణి దంపతులచే ఛౌడేశ్వరి దేవి జ్యోతీర్మహోత్సవాలు జరపడానికి అన్ని ఏర్పాటు చేసినట్లు కమిటీ పేర్కొంది.

కనుల పండువగా కల్యాణ మహోత్సవం

చల్లపల్లి(అవనిగడ్డ): మద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ 47వ వార్షిక కల్యాణ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. చల్లపల్లిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ఆలయం వార్షిక కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని విశ్వకర్మ, ధ్వజ ప్రతిష్ఠ, కలశ ప్రతిష్ఠ, అఖండ జ్యోతి కార్యక్రమాలను కనుల పండువగా నిర్వహించారు. మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శీమీరుపేట సాయిబాబు, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, కోశాధికారి కేశనకుర్తి శరత్‌బాబు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

చిన్నారికి ఆర్థికసాయం

మోపిదేవి: మోపిదేవి దేవస్థానంలో స్వీపర్‌గా పనిచేస్తున్న పెండ్ర నాగలక్ష్మణ మణికుమార్(నరసింహ) కుమార్తెకు అవనిగడ్డకు చెందిన పారిశ్రామికవేత్త విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు రూ. 15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మోపిదేవి కాలనీకి చెందిన నరసింహ, జాన్సీ దంపతులకు నెలలు నిండని పాప జన్మనిచ్చింది. దీంతో పలు ఆరోగ్య సమస్యలు ఏర్పడటంతో కుటుంబ సభ్యులు తీవ్ర మనోవేదన పడుతున్నారు. విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు శుక్రవారం బాధితుల ఇంటికి వెళ్లి తన వంతు సాయం అందజేశారు.

ఈ నెలాఖరులోగా పన్నులు చెల్లించండి

మచిలీపట్నంటౌన్: నగరపాలకసంస్థ పరిధిలో ఆస్తి, తాగునీటి, ఖాళీ స్థలాల పన్నులను ఈ నెలాఖరులోగా చెల్లించాలని కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెలాఖరులోగా పన్నులు చెల్లించకుంటే వారి గృహాలకు ఉన్న విద్యుత్ కనెక్షన్‌లను తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు. పన్నుదారులు వారి పన్నులను సకాలంలో చెల్లించాలని ఆయన కోరారు.

కులం పేరుతో దూషించిన కేసులో జైలు శిక్ష, జరిమానా

చిలకలపూడి (మచిలీపట్నం): షెడ్యూలు కులాలకు చెందిన మహిళను కులం పేరుతో అవమానించి, దూషించిన కేసులో ఇరువురికి ఆరు నెలలు జైలు శిక్ష, రూ. 10 వేలు చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ కోర్టు, 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్ చినబాబు శుక్రవారం తీర్పు చెప్పారు. జి.కొండూరు మండలం వెలగలేరు గ్రామానికి చెందిన కొర్రపాటి మరియమ్మకు అదే గ్రామంలో ప్రభుత్వం కొంత భూమిని మంజూరు చేసింది. ఆ భూమిలో ఆమె సాగు చేసుకుంటుండగా అక్రమంగా ప్రవేశించిన మందిదీల సాంబశివరావు, కోగంటి భారతిలు అసభ్యకరంగా మాట్లాడి కులం పేరుతో అవమానపరిచారు. ఈ ఘటనపై జి.కొండూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసులో మచిలీపట్నం ఎస్సీ, ఎస్టీ కోర్టులో తొమ్మిది మంది సాక్షులను విచారించిన న్యాయమూర్తి కోగంటి భారతి, మందిదీల సాంబశివరావులకు ఒక్కొక్కరికి ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష, రూ. 5 వేలు జరిమానా విధించారు. జరిమానా మొత్తాన్ని బాధితులకు అందివ్వాలని తీర్పులో పేర్కొన్నారు.

సింధు స్నానాల ఏర్పాట్లపై తర్జనభర్జన


సమావేశంలో పాల్గొన్న అధికారులు, శృంగేరీ పీఠం ప్రతినిధులు

కోడూరు: హంసలదీవిలో ఈ నెల 10వ తేదీ నుంచి జరిగే వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు, 12న పాలకాయతిప్ప బీచ్ వద్ద జరిగే సింధు స్నానాలకు సంబంధించిన ఏర్పాట్లపై శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని శాఖలాధికారులతో పాటు హంసలదీవి ఆలయాన్ని దత్తత తీసుకున్న శృంగేరీ పీఠం ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. సింధుస్నానాలు, బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు అందరూ సమన్వయంతో పని చేయాలని అవనిగడ్డ సీఐ యువకుమార్, తహసీల్దార్ శ్రీనునాయక్, ఎంపీడీఓ సుధాప్రవీణ్ కోరారు. అయితే ఈ ఏడాది ఉత్సవాలను నిర్వహించేందుకు తమ వద్ద నిధులు లేవని శృంగేరీ పీఠం ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు. మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి, ఎస్ఐలు చాణిక్య, పూర్ణ మాధురి, కార్యదర్శి లీలాప్రియాంక, పంచాయతీ, ఫిషరీస్, విద్యుత్, వైద్యశాఖ, ఫైర్, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

భీష్మ ఏకాదశికి ముస్తాబైన ఉల్లిపాలెం

- 13 జిల్లాల నుంచి తరలిరానున్న 50 భక్త మండళ్లు
- తులసీ దళాలలను సిద్ధం చేస్తున్న భక్తులు


ముస్తాబైన శ్రీమన్నారాయణుడి ఆలయం

కోడూరు: అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెం శ్రీగోదా, రాజ్యలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామివారి ఆలయం భీష్మ ఏకాదశి పర్వదిన వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆంధ్రప్రదేశ్ శ్రీగోదా విష్ణు సహస్రనామ పరివార్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో 13 జిల్లాలకు చెందిన 50 భక్త మండళ్ల సభ్యులు శనివారం ఆలయ ప్రాంగణంలో విష్ణుసహస్ర పారాయణాన్ని నిర్వహించేందుకు తరలి వస్తున్నారు. కర్నూలు, హైదరాబాద్, ఖమ్మం, కడప, గుంటూరు, విశాఖపట్నం, ఉభయ గోదావరి, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, నల్లగొండ జిల్లాలకు చెందిన సుమారు 300మంది ఈ పారాయణంలో పాల్గొంటారని ఆలయ నిర్మాణకర్త, అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ శుక్రవారం తెలిపారు. ఉదయం 8గంటలకు అష్టభుజ మండపంలో పారాయణ ఏకాహాన్ని ప్రారంభించి 24 గంటల పాటు నిర్విరామంగా కొనసాగించనున్నట్లు తెలిపారు. అంపశయ్యపై ఉండగా భీష్ముడు నోటి నుంచి వెల్లువడిన విష్ణుసహస్ర నామాన్ని పఠించడం వల్ల లోకం సుభిక్షంగా ఉంటుందని స్వామిజీ చెప్పారు. గోదాదేవి, రాజ్యలక్ష్మీ అమ్మవార్లకు సామూహిక కుంకుమార్చన ఉంటుందన్నారు. విష్ణు సహస్ర పారాయణాన్ని నిర్వహించేందుకు అవసరమైన తులసీ దళాలను భక్తులు ఆలయం ప్రాంగణంలో సిద్ధం చేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తమండళ్లకు అన్ని వసతులు కల్పించినట్లు పరివార్ అధ్యక్షుడు కర్నూలుకు చెందిన మారం నాగరాజ గుప్తా పేర్కొన్నారు.

క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థులు


శ్రీకాకుళం హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాకుళం(ఘంటసాల): ఘంటసాల మండలం గొగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో 84వ గ్రిగ్ మెమోరియల్ బాలుర సెంట్రల్ జోన్ ఆటల పోటీలు, కోడూరు మండలం లింగారెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్లో జరిగిన బాలికల సెంట్రల్ జోన్ పోటీల్లో శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ మేరకు శుక్రవారం హెచ్‌ఎం అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి మాట్లాడుతూ బాలికల విభాగంలో అండర్ -14 సాఫ్ట్ బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం, అథ్లెటిక్స్ పోటీలు బాలురు జూనియర్స్ విభాగంలో పి.విజయ తేజ హైజంప్, 100 మీటర్స్ పరుగు పందెంలో మొదటి స్థానం, లాంగ్ జంప్‌లో తృతీయ స్థానం, సీనియర్స్ విభాగంలో కె.రోహన్ హైజంప్‌లో ద్వితీయ, త్రిపుల్ జంప్‌లో తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ఆయా విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన పీడీ బడే వెంకటేశ్వరరావును అభినందించారు.

ప్రతిభ చూపిన హరీష్

నాగాయలంక: కృష్ణాజిల్లా 84వ వార్షిక సెకండరీ స్కూల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సెంట్రల్ జోన్ ఆటల పోటీల్లో స్థానిక జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి రేవు హరీష్ రన్నింగ్‌లో సత్తాచాటాడు. ఘంటశాల మండలం గోగినేనిపాలెంలో ఇటీవల జరిగిన పోటీల్లో తమ పాఠశాల విద్యార్థి 200, 400మీటర్ల రన్నింగ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించారని పాఠశాల హెచ్‌ఎం పీవీఎస్‌వీ ప్రసాదరావు శుక్రవారం తెలిపారు. శిక్షణ ఇచ్చిన పీడీలు గాజుల లక్ష్మీప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావు, విద్యార్థిని ఎస్ఎంసీ చైర్మన్ వక్కపట్ల లీలామారుతీ అభినందించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


ఉపాధ్యాయులను సత్కరించిన పూర్వవిద్యార్థులు

మచిలీపట్నంటౌన్: స్థానిక జైహింద్ ఎయిడెడ్ సెకండరీ పాఠశాల 77వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అయ్యగారి రామమూర్తి పంతులు 1947 ఆగష్టు 15వ తేదీన భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ పాఠశాలను స్థాపించారన్నారు. పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం చదువు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. పలు పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. 1984–85 సంవత్సర పూర్వవిద్యార్థుల తరుపున మధుసూదనరావు, రమాజ్యోతి రూ. 50 వేల నగదు, 1988–89 పూర్వ విద్యార్థులు రూ. 25 వేల నగదును పాఠశాలకు అందజేశారు. పాఠశాల పాలకవర్గ అధ్యక్షుడు నారాయణరావు, పాఠశాల కార్యదర్శి కె. అచ్యుతరామయ్య, హెచ్‌ఎం ఎస్‌వీఎస్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ


మోపిదేవిలో ఉపాధ్యాయులకు మందులు అందజేస్తున్న ఎంపీడీవో స్వర్ణభారతి

మోపిదేవి: అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులు, చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలని ఎంఈఓ ఏ పిచ్చయ్య తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో స్వర్ణభారతి సమక్షంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి ఉపాధ్యాయులకు మాత్రలు అందజేశారు. ఈనెల 10వ తేదీ పిల్లందరికీ వాటిని అందజేయాలని సూచించారు. మోపిదేవి, పెదకళ్ళేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఎంపీడీవో ఏవో ఏ పాండురంగారావు, సీనియర్ అసిస్టెంట్ నాగశశికుమార్ పాల్గొన్నారు.

ఘంటసాల: ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో నులిపురుగుల నివారణపై వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ అధికారులతో శుక్రవారం ఎంపీడీవో డి.సుబ్బారావు సమావేశం నిర్వహించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు నులిపురుగు నివారణ మందులను పంపిణీ చేశారు. తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, ఎంఈవో-2 ఎండీ మోమిన్, పీహెచ్‌సీ వైద్యులు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ట


మాచవరం గ్రామం ప్రతిష్ఠోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు


కూడేరులో విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో అవిర్నేని ప్రపూర్ణ చంద్, ఝాన్సీలక్ష్మీ దంపతులు

పెడన: మండల పరిధిలోని ఉరివి పంచాయతీ గాయంపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకోదండ రామాలయంలో శ్రీసీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వేదపండితుడు పుల్లేటికుర్తి గణపతి శర్మ ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించిన పిమ్మట విగ్రహ ప్రతిష్ఠ జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోడూరు: మండలంలోని మాచవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆలయంలో అంకాలమ్మ తల్లి, అమ్మగారి తల్లి, పోతురాజు స్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూర్ణాహుతిలో పాల్గొని గోపూజ చేశారు.

రూ. 1,00,116లు విరాళం

కొత్తపల్లి(ఘంటసాల): పమిడిముక్కల మండలం కూడేరు గ్రామంలోని వేంచేసి యున్న శ్రీశ్రీశ్రీ ఉమా మహేశ్వర సమేత శ్రీ విజయ కనకదుర్గాదేవి వార్ల దేవస్థానంలో అమ్మవారి, స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహం కొరకు రూ. 1,00,116లు విరాళం అందించిన ఆలయ మహారాజ పోషకులు అవిర్నేని ప్రపూర్ణ చంద్ – ఝాన్సీ లక్ష్మీ దంపతులను ఆలయ కమిటీ సన్మానించారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

పది పబ్లిక్ పరీక్షలపై అవగాహన

అవనిగడ్డ: స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలోని పదోతరగతి విద్యార్థినిలకు పబ్లిక్ పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్‌డబ్ల్యూవో బి మోహనరావు, మచిలీపట్నం ఏఎస్‌డబ్ల్యూవో ఎస్ రాజశేఖరరెడ్డి పదో తరగతి పరీక్షల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చదివినవి గుర్తుంచుకోవడానికి టెక్నిక్‌లు నేర్పించారు. ఎంఈఓ– 2 పిచ్చయ్య, డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు వీరకుమారి, దివిసీమ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ టి.జె సత్యప్రసాద్‌లు విద్యార్థినిలకు పలు సబ్జెక్టులపై అవగాహన కల్పించారు. వసతిగృహ అధికారులు రేపల్లె అనురాధ, బొడ్డు శ్రీనివాస్, ప్రసాద్, బాబూరావు, నాగలక్ష్మి, షాజహాన్, వనజ, తమ్ము శ్రీనివాసరావు, కాటూరు సురేష్ పాల్గొన్నారు.

అప్రమత్తతతో రూ.6లక్షలు కాపాడిన బ్యాంక్ మేనేజర్

నాగాయలంక: డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ నేరగాళ్ల వలలో పడిన ఓ ఫించనర్‌కు చెందిన రూ.6 లక్షలు పోకుండా బ్యాంక్ మేనేజర్ శుక్రవారం కాపాడారు. నాగాయలంకలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ శీల ఈశ్వరరావు అప్రమత్తమై సంబంధిత ఖాతాదారును సంరక్షించారు. మేనేజర్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. చాలా కాలంగా 69సం. ఫించనర్‌ని ఇటీవల స్కామర్లు టార్గెట్ చేసారు. డిజిటల్ అరెస్ట్‌లో ఉన్నారని, ఈ విషయాన్ని రహస్యంగా ఉంచాలని బెదిరించి డబ్బు కాజేయాలని చూశారు. బాధితుడు రూ.6 లక్షలు వ్యక్తిగత రుణం తీసుకుని ఆ డబ్బును సైబర్ నేరగాళ్లు చెప్పిన ఎకౌంట్‌కు బదిలీ చేయాలని అదే బ్యాంకుకు వచ్చారు. ట్రాన్స్‌ఫర్ చేయాల్సిన ఖాతాదారు పేరు, అతను పడుతున్న ఆందోళనను పసిగట్టిన మేనేజర్ డబ్బు బదిలీ విషయంపై ఆరా తీసారు. మేనేజర్ ఒత్తిడి తేవడంతో డిజిటల్ అరెస్ట్‌కు సంబంధించిన మొత్తం వ్యవహారం మేనేజర్‌కు చెప్పక తప్పలేదు. దీంతో అప్రమత్తమైన రూ. 6లక్షల డబ్బు బదిలీ కాకుండా ఆపేశారు.

మానవ హక్కులపై అవగాహన అవసరం

చల్లపల్లి(అవనిగడ్డ): ప్రతి ఒక్కరూ తమ హక్కులను తెలుసుకోవాలని మాజీ ప్రభుత్వ న్యాయవాది అహ్మదున్నీసా పేర్కొన్నారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చల్లపల్లి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం మానవ హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అహ్మదున్నీసా మాట్లాడుతూ మానవ హక్కులు, బాలల హక్కులు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో హెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోవాడ ప్రశాంతి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఎంపీడీవో ఏవీ రమణ, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, హెచ్‌ఆర్ఎస్ కార్యదర్శి ఎస్ ఝాన్సీ పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఉచిత న్యాయసహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చల్లపల్లి(అవనిగడ్డ): కోర్టుల ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ న్యాయవాది పరిశె సరస్వతి పేర్కొన్నారు. బాండెడ్ లేబర్ రద్దు దినోత్సవాన్ని పురస్కరించుకుని చల్లపల్లి కోమలానగర్‌లో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ కె.వి. రామకృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయవాది సరస్వతి మాట్లాడుతూ సమస్యలు వచ్చినప్పుడు నిర్భయంగా కోర్టుని ఆశ్రయించి న్యాయం పొందాలని సూచించారు. చల్లపల్లి, ఘంటసాల మండలాల పారా లీగల్ వలంటీర్లు పసుపులేటి నాగలక్ష్మీ, ఉప్పు మంజూష, జ్యోతి, రంజని పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతురుకు గాయాలు

గూడూరు: విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతురుకు తీవ్ర గాయాలయ్యాయి. గూడూరు మండలం ఐదుగుళ్లపల్లి గ్రామానికి చెందిన గోవాడ సుబ్బారావు(46) కంకిపాడు మండలంలో వీఆర్వోగా పనిచేస్తున్నాడు. శనివారం బంధువుల ఇంట్లో శుభకార్యానికి తన చిన్న కూతురును తీసుకుని వెళ్లి ద్విచక్రవాహనంపై ఐదుగుళ్లపల్లికి వస్తున్నాడు. రామరాజుపాలెం అడ్డరోడ్డు దగ్గర డివైడర్ క్రాస్ చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో తండ్రీకూతురు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు క్షతగాత్రులను ప్రైవేటు వాహనంలో బందరు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సకు విజయవాడకు తరలించారు.

లక్ష్మణరావును మరోసారి గెలిపించుకోవాలి

ఘంటసాల: త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కె.ఎస్ లక్ష్మణరావును మరోసారి గెలుపించుకోవాలని సీపీఎం నేతలు అన్నారు. ఘంటసాలలో శుక్రవారం వివిధ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. వివిధ సంఘాల నేతలు వాకా రామచంద్రరావు, కరీముల్లా, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వంటలు చేసి.. విక్రయించి

మచిలీపట్నంటౌన్: నగరంలోని నోబుల్ కళాశాలలో ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా నోబుల్ చారిటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా అధ్యాపకులు పలు రకాల తినుబండారాలను వండి వాటిని విక్రయించారు. విక్రయించగా వచ్చిన మొత్తాన్ని లాటరీ ద్వారా విజేత అయిన పేద విద్యార్థులకు ఉపకార వేతనంగా అందజేశారు. 19వ డివిజన్ కార్పొరేటర్ దేవరపల్లి అనిత, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గాడెల్లి డేవిడ్ శామ్యూల్, మాజీ కౌన్సిలర్లు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌జే ఎర్నెస్ట్ పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ

బంటుమిల్లి: లారీ అదుపుతప్పి కారును ఢీకొన్న ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని అర్తమూరు సర్పంచ్ బొర్రా రమేష్ శుక్రవారం ఉదయం తాను మచిలీపట్నం వెళ్లేందుకు కారులో బయలుదేరారు. 216 జాతీయ రహదారిపైకి వెళుతుండగా మచిలీపట్నం వైపు వేగంగా వెళుతున్న లారీ అదుపుతప్పి రమేష్ కారును బలంగా ఢీకొంది. ప్రమాదంలో కారు ఎడమ భాగం దెబ్బతింది. రమేష్ సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నట్టేట ముంచిన నకిలీ పట్టు పురుగులు


గూళ్లు కట్టుకోని పట్టు పురుగులు చూపుతున్న రైతులు

పాపవినాశనం(ఘంటసాల): అలవాటు పడిన పంట కదా అని పట్టు పురుగులు వేసి తీవ్రంగా నష్టపోయామంటూ ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామానికి చెందిన రైతులు గగ్గోలు పెడుతున్నారు. రైతుల వివరాల మేరకు.. ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామానికి చెందిన ఐదుగురు రైతులు లంక భూముల్లో పట్టు గూళ్ల పంట పండిస్తున్నారు. అయితే జనవరి 8వ తేదీన సెరీకల్చర్ అధికారులు ఆయా రైతులకు పట్టు పురుగులు పంపిణీ చేయగా వారు వాటికి మేత, మందులు వేసి పెంచుతున్నారు. ఇప్పటి వరకు ఒక్కో రైతు సుమారు రూ. 50 వేల వరకు ఖర్చు చేశామని కానీ ఇప్పటి వరకు పంట చేతికి రాలేదన్నారు. దీనికి కారణం అధికారులు మాకు నకిలీ పట్టు పురుగులు సరఫరా చేయడం వల్లే నష్టపోయామని ఆరోపిస్తున్నారు. 14 మేతలకు రావాల్సిన పట్టు పురుగులు 24 మేతలు వేసిన గూళ్లు కట్టుకోలేదన్నారు. ఇప్పటి వరకు అధికారులు ఎన్నిసార్లు చెప్పిన కనీసం పంట చూడటానికి కూడా రాలేదని వాపోయారు. తీవ్రంగా నష్టపోయిన మమ్మల్ని అధికారులు, ప్రభుత్వం ఆదుకుని నష్టపరిహారం ఇప్పించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. కుంపటి సుబ్బారావు, కైతేపల్లి మల్లేశ్వరరావు, కనగాల బాబూరావు, వెలివోలు గ్రామానికి చెందిన పెనుమత్స కృష్ణారావు, ఇతర రైతులు పాల్గొన్నారు.

వైభవంగా గజమాల గ్రామోత్సవం

బంటుమిల్లి: మండల పరిధిలోని చోరంపూడి గ్రామం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా అంతర్వేది నరసింహస్వామి ఆలయానికి శుక్రవారం అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో గజమాల గ్రామోత్సవం నిర్వహించారు. అంతర్వేది కల్యాణోత్సవాల సందర్భంగా స్వామివారికి వార్షికంగా గజమాలతో సంఘ సభ్యులు పెద్ద ఎత్తున మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహిస్తూ అంతర్వేది తీర్థానికి వెళ్లడం ఆనవాయితీ. ఇందులో భాగంగా యువకులు స్వామివారి కల్యాణంలో పాల్గొనేందుకు తరలివెళ్లారు. కార్యక్రమానికి మిస్ గ్లోబల్ ఏషియన్ 2025 టైటిల్ విన్నర్ చిన్నతంబు భావన సంఘీభావం తెలిపి ర్యాలీని ప్రారంభించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించండి

తెలుగురావుపాలెం(ఘంటసాల): తమ గ్రామంలోని ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని ఘంటసాల మండలం తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు మచిలీపట్నం ఆర్డీఓ కె.స్వాతికి శుక్రవారం విన్నవించారు. ఈ సందర్భంగా మచిలీపట్నంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓను కలిసి గత ప్రభుత్వంలో పేదలందరికి ఇళ్లు కార్యక్రమంలో భాగంగా మంజూరు చేసిన స్థలం వివాదాల్లో ఉందని సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు.